నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 23 జూలై 2024 | SURYAPET


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, జూలై 22 : వన మహోత్సవం కింద ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను నెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని, ఉపాధిహామీ పథకం కింద ఉద్యాన వనాల్లో మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలని సూచించారు. రుణమాఫీకి సంబంధించిన డబ్బులు రైతుల ఖాతాల్లో జమకాక పోతే వాటిపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా టీఎస్ ఐపాస్, టీ ప్రైడ్ కింద పరిశ్రమల ఏర్పాటు, సబ్సిడీపై వాహనాల కొనుగోలు అనుమతికి వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి కలెక్టర్ నారాయణరెడ్డి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. అధికారులు సమయ పాలన పాటించటంతో పాటు పనిలో నాణ్యత, రెగ్యులేరిటీ, ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం ఉండాలన్నారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో 96 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 53 ఫిర్యాదులు రెవెన్యూ విభాగానికి సంబంధించినవి కాగా 43 ఇతర అంశాలకు సంబంధించినవి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజన్, డీఆర్వో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎంజీయూ ఫలితాలు విడుదల

ఫలితాలు విడుదల చేస్తున్న ఎంజీయూ ఇన్‌చార్జి వీసీ నవీన్‌మిట్టల్, యూనివర్సిటీ అధికారులు

రామగిరి, జూలై 22 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పీహెచ్‌డీ ఎంట్రెన్స్ తోపాటు డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ ఫలితాలను సోమవారం హైదరాబాద్‌లో వర్సిటీ ఇన్‌చార్జి వీసీ నవీన్‌మిట్టల్ విడుదల చేశారు. ఆయనతోపాటు ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ అల్వాల రవి, సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి ఇందులో పాల్గొన్నారు. ఫలితాలను www.mguniversity. ac.inలో అందుబాటులో ఉంచినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూకు సంబంధించిన షెడ్యూల్‌ను వారంలో రోజుల్లో విడుదల చేస్తామని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి వెల్లడించారు.

పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ఫలితాలు :

ఎంజీయూలో ఏడు కోర్సుల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించిన ఎంట్రెన్స్‌లో 363 అభ్యర్థులు హాజరు కాగా 171మంది ఉత్తీర్ణత సాధించారు. అర్హత సాధించిన వారిలో బయోకెమిస్ట్రీలో ముగ్గురు, బయోటెక్నాలజీలో ఆరుగురు, కంప్యూటర్ సైన్స్‌లో ముగ్గురు, బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో 93, కెమిస్ట్రీలో 8, కామర్స్‌లో 49, గణితంలో 9 మంది ఉన్నారు.

డిగ్రీ ఫలితాలు : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ పరీక్షలకు 8,113 మంది విద్యార్థులు హాజరు కాగా 3,493మంది అన్ని సెమిస్టర్లలో ఉత్తీర్ణత సాధించారు. 43శాతం ఫలితాలు వచ్చాయి.

- సెమిస్టర్ -1 రెగ్యులర్, బ్యాక్‌లాగ్‌లో 6,942 మంది హాజరుకాగా 2,601మంది (37.47శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- సెమిస్టర్ -2లో 12,545 మంది హాజరు కాగా 4,472 మంది (35.65 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- సెమిస్టర్ -3లో 6,070 మంది హాజరుకాగా 2,470 మంది (40.60శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- సెమిస్టర్ -4లో 12,330 మంది హాజరు కాగా 5,131 (41.61 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- సెమిస్టర్ -5లో 5,100 హాజరు కాగా 2,289 మంది (44.88శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- సెమిస్టర్ -6లో 1,1573 మంది హాజరు కాగా 5,286 మంది (45.68శాతం) ఉత్తీర్ణత సాధించారు.

డీఎస్సీకి మూడో రోజు 349 మంది హాజరు

రామగిరి, జూలై 22 : నల్లగొండలోని ఎస్‌పీఆర్ పాఠశాల ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో సోమవారం మూడో రోజు జరిగిన డీఎస్సీ పరీక్షలకు 349 మంది అభ్యర్థులు హాజరు కాగా 21 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ఎస్‌జీటీ పరీక్షకు 185 మందికిగానూ 174మంది, మధ్యాహ్నం జరిగిన స్కూల్ అసిస్టెంట్ గణితం పరీక్షకు 185 మందికిగానూ 175 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నీలంరెడ్డి వెల్లడించారు.

తాగునీటి అవసరాలకు ఏఎమ్మార్పీ నీటి విడుదల

ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న నీరు

పెద్దఅడిశర్లపల్లి జూన్ 22 : జిల్లా తాగునీటి అవసరాల నిమిత్తం ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నుంచి ఉదయ సముద్రానికి వచ్చే ప్రధానకాల్వలోకి సోమవారం ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ఏఎమ్మార్పీ నుంచి రెండు మోటర్ల ద్వారా 800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రధాన కాల్వకు 500 క్యూసెక్కులు వెళ్తుండగా మంగళవారం మరో 500 క్యూసెక్కులకు పెంచనున్నారు. వారం పదిరోజుల పాటు నిరంతరంగా వెయ్యి క్యూసెక్కులు కొనసాగించనున్నట్లు ఎస్ఈ తెలిపారు. ప్రస్తుతం సాగర్‌లో నీటి మట్టం గణనీయంగా తగ్గడంతో కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగిస్తున్నామని, ఆయకట్టుకు నీటి విడుదల లేదని, రైతులు సహకరించాలని కోరారు. నీటిని విడుదల చేసిన వారిలో ఈఈ సత్యనారాయణ, డీఈ చక్రపాణి, నాగయ్య, ఏఈ శ్రావణ్ కుమార్ ఉన్నారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవం పెంచిన ఘనత కేసీఆర్‌దే

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అందులో భాగమే..

- కేసీఆర్ ముందు చూపుతో పెట్టిన సంక్షేమ పథకాలే అందరికీ అండగా నిలిచాయి
- కాంగ్రెస్ వస్తే తులం బంగారం అదనంగా వస్తదని ఆశపడ్డారు
- ఇన్ని రోజులు ఆలస్యమైతే నిజమేనని నమ్మినం
- చివరికి కేసీఆర్ తెచ్చిందే అమలు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- 407 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

సూర్యాపేట కలెక్టరేట్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

సూర్యాపేట టౌన్/ఆత్మకూర్.ఎస్, జూలై 22 : పోరాడి రాష్ట్రాన్ని సాధించి అధికారం చేపట్టిన పదేండ్లలో అన్ని రంగాల అభివృద్ధిపాటు ఆడబిడ్డల ఆత్మగౌరవం పెంచిన ఘనత బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అందులో భాగమేనని, అంతే కాకుండా అత్యధికంగా సంక్షేమ పథకాలు మహిళల పేరిట అందించిన ఘనత కూడా ఆయనదేనని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఆయన 407 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆత్మకూర్.ఎస్, పెన్‌పహాడ్ ఎంపీడీఓ కార్యాలయాల తర్వాత సూర్యాపేట కలెక్టరేట్ జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ సమయంలో అందరి కష్టాలు తెలుసుకున్న కేసీఆర్ సమాజంలో ఆడపిల్లలు కుటుంబానికి భారం కాకూడదని భావించి వారిపేరు మీద అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, నేడు అవే అందరికీ అండగా నిలుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ వస్తే కేసీఆర్ ఇస్తున్న రూ.లక్షతో పాటు మరో తులం బంగారం అదనంగా వస్తదని ఆశపడి ప్రజలకు వారికి అధికారం ఇచ్చారని, కానీ ఇప్పుడు వారికి ఎందుకు ఓటు వేశామా అని బాధపడుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు అందించడం ఇన్ని రోజులు ఆలస్యమైతే తాము కూడా నిజమేనని నమ్మామని, కానీ నేడు అక్కాచెల్లెళ్ల ఆశలు అడియాశలయ్యాయని, చివరికి కేసీఆర్ తెచ్చిందే అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పథకాల అమలుతో పాటు 6 గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, ఆర్డీఓ వేణు మాధవరావు, తాసీల్దార్లు వినోద్‌కుమార్, మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓలు ఎండీ హసీం, వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ తాసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్లు కొణతం సత్యనారాయణరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, ఆర్ఐ రమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాలేరుకు నీటిని తరలించుకుపోతున్నా సోయిలేని జిల్లా మంత్రులు

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, జూలై 22 : నల్లగొండ జిల్లా సాగర్ ఆయకట్టు ప్రాంత రైతాంగానికి నీళ్లు ఇవ్వకుండా ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తరలించుకెళ్తున్నా జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సోయి లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు విమర్శించారు. అక్రమంగా ఖమ్మం జిల్లాకు నీటిని తరలిస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. సమృద్ధిగా వర్షాలు కురుస్తూ కృష్ణాలో పుష్కలంగా నీళ్లున్నా, శ్రీశైలం నుంచి 1.50లక్షల క్యూసెక్కుల నీరు వస్తున్నా ప్రభుత్వం నల్లగొండ జిల్లాకు నీళ్లు విడుదల చేయకుండా ఖమ్మం జిల్లా పాలేరు జలాశయాన్ని నింపడానికి నీటిని తరలిస్తున్నదని తెలిపారు. నల్లగొండ జిల్లాను ఎండబెట్టి ఖమ్మం జిల్లాకు ఇప్పటికి మూడుసార్లు నీటిని తరలించారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో తాగునీటికి కొదువ లేకపోయినప్పటికీ మన రైతాంగానికి నీళ్లు ఇవ్వకుండా తరలించుకెళ్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి నల్లగొండ జిల్లా ప్రాంతంతో పాటు మిర్యాలగూడ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పహారా నడుమ పాలేరుకు నీటి సరఫరా

- రాత్రి, పగలు విడుతల వారీగా విధులు
- పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది అవస్థలు

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని జాన్‌పహాడ్ తూము వద్ద విధులు నిర్వహిస్తున్న గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, లస్కర్

నేరేడుచర్ల, జూలై 22 : కృష్ణా నది యాజమాన్య కమిటీ సూచనల మేరకు నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా తాగు నీటి కోసం ఖమ్మం జిల్లా పాలేరుకు బందోబస్తు నడుమ నీటిని సరఫరా చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు నుంచి కుడి కాల్వకు 5 టీఎంసీలు, ఎడమ కాల్వకు 4.5 టీఎంసీలు నీటి విడుదల చేయాలని కేఈఆర్ ఎంబీ నిర్ణయించింది. ఈ మేరకు సాగర్ నుంచి పాలేరు వరకు నీటి సరఫరా అవుతుండగా తూముల ద్వారా రైతులు సాగు నీటి కోసం అక్రమంగా నీటిని తరలించకుండా ప్రతి తూము వద్ద గ్రామ కార్యదర్శులు, లస్కర్లు, రెవెన్యూ సిబ్బంది పహరా కాస్తున్నారు. ఈ మూడు శాఖల సిబ్బంది రెండు విడుతలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో సిబ్బంది 12 గంటల చొప్పున రాత్రి, పగలు విధులు నిర్వహించే విధంగా ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. గతంలో కూడా తాగునీటి అవసరాల సాకుతో ఇదే విధంగా పాలేరుకు నీటిని తరలించడం పట్ల ఎడమ కాల్వ దిగువ ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హుజూర్‌నగర్ శాసన సభ్యుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండి కూడా ఈ ప్రాంతానికి తాగునీటి కోసం స్థానిక కాల్వల ద్వారా నీరు విడుదల చేయకపోవడం విచారకరం అని పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఎడమ కాల్వ నుంచే కాకుండా మేజర్ కాల్వల నుంచి నీటిని తరలించి నీటి ఎద్దడిని నివారించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామ కార్యదర్శులు ప్రస్తుత వర్షాకాలంలో పారిశుధ్య పనులను పట్టించుకోకుండా ఎడమ కాల్వ తూముల వద్ద విధులు నిర్వహించాల్సి రావడంతో గ్రామాల్లో సమస్యలు వస్తున్నాయని, మౌలిక వసతులు కల్పించేవారు లేకుండా పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మళ్లీ దొంగల భయం

జిల్లాలో రెచ్చిపోతున్న దోపిడీ ముఠాలు

- వేసవిలో చైన్ స్నాచింగ్ గ్యాంగ్ బీభత్సం
- ముఠా అరెస్ట్‌తో కొంత కాలం గ్యాప్
- మళ్లీ రోజుకో చోట దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు
- బస్సులు, బస్టాండ్లలో పర్సులు, సెల్‌ఫోన్లు, బైక్‌లు చోరీ
- చాలా చోట్ల పనిచేయని సీసీ కెమెరాలు
- నిందితుల గుర్తింపు, సొత్తు రికవరీ అంతంతే..
- పోలీసులకు సవాల్‌గా మారిన వరుస ఘటనలు

జిల్లాలో దొంగలు మళ్లీ బీభత్సం సృష్టిస్తున్నారు. నిత్యం చోరీలు, దొంగతనాలతో రెచ్చిపోతున్నారు. రోజుకో ఊరిలో దొంగతనాలు చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. వేసవిలో వరుస చైన్‌స్నాచింగ్, దొంగతనాలు జరగ్గా, ఓ ముఠా అరెస్ట్‌తో మధ్యలో గ్యాప్ వచ్చింది. ఇప్పుడు దొంగలు మళ్లీ తడాఖా చూపిస్తున్నారు. బస్సులు, బస్టాండ్లలో పర్సులు, సెల్‌ఫోన్లు, బైక్‌లు అపహరిస్తున్నారు. నిందితుల గుర్తింపు, సొత్తు రికవరీ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. నాన్‌స్టాప్ ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి.

– యాదాద్రి భువనగిరి, జూలై 22 (నమస్తే తెలంగాణ)

నిత్యం ఏదో ఒక చోట..

బీఆర్ఎస్ హయాంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. ఎక్కడా దొంగతనాలు, చైన్‌స్నాచర్లు పెద్దగా కనిపించేవి కాదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో క్రైం రేట్ పెరుగుతూ వస్తున్నది. గత ఆరు నెలలుగా దొంగతనాలు, చోరీల్లో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తున్నది. వేసవిలో వరుసగా చైన్ స్నాచర్లు జరిగాయి. ఆరు బయట పడుకున్నా, మిద్దె మీద నిద్రించినా, ఇంట్లో ఉన్నా పెద్ద ఎత్తున దొంగతనాలు జరిగాయి. దీంతో పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా గస్తీ కాశారు. ఆఖరికి ఓ ముఠాను పట్టుకుని అరెస్ట్ చేశారు. దాంతో కొన్ని రోజులుగా దొంగతనాలు పెద్దగా కనిపించలేదు. కానీ ఇటీవల మళ్లీ దొంగలు చెలరేగిపోతున్నారు. సెల్ షాపులు, మూసి ఉన్న దుకాణాలు, ఇండ్లు టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నారు.

బస్సులు, బస్టాండ్లలో ఎక్కువగా..

బస్టాండ్లలో సైతం యథేచ్ఛగా చోరీలు జరుగుతున్నాయి. బస్సులు రద్దీగా ఉంటుండటంతో దొంగలు తమ పనిని సులువుగా కానిచ్చేస్తున్నారు. బస్సుల్లో పర్సులు, సెల్‌ఫోన్లు కొట్టేస్తున్నారు. బాధితులు మాత్రం ఫిర్యాదులు చేయకుండా వదిలేస్తున్నారు. ఈ తరహా చోరీలు ఇటీవల పెరుగడం ఆందోళన కలిగిస్తున్నది. ముఖ్యంగా భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ బస్టాండ్లలో పదుల సంఖ్యలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు బైక్‌లు సైతం మాయమవుతున్నాయి.

నిందితుల గుర్తింపు, రికవరీ అంతంతే..

వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. దొంగలు పోలీసులకు దొరక్కుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో నెలలు దాటుతున్నా గుర్తించలేకపోతున్నారు. దీంతో పోయిన సొత్తు, బంగారం రికవరీ కావడంలేదు.

భువనగిరిలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో ఆదివారం రాత్రి మాస్క్‌తో దొంగతనానికి వచ్చిన వ్యక్తి సీసీ ఫుటేజీలో రికార్డ్ అయిన దృశ్యం

భువనగిరిలో పనిచేయని సీసీ కెమెరాలు

భువనగిరి మున్సిపాలిటీలో వందల సంఖ్యలో సీసీ కెమెరాలు ఉన్నాయి. సీసీ కెమెరాలు అమర్చుకోవాలని పోలీసులు పదేపదే సూచిస్తున్నారు. కానీ అనేక చోట్ల సీసీ కెమెరాలు ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని ఒకటి, రెండు కాలనీల్లో మినహా ఎక్కడా పనిచేయడంలేదని తెలుస్తున్నది. దీని పర్యవేక్షణ కూడా గాలికి వదిలేశారు. మున్సిపాలిటీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి జోక్యంతో సీసీ కెమెరాల కాంట్రాక్టు ముందుకు సాగుడం లేదనే ప్రచారం జరుగుతున్నది.

ఇటీవలి ఘటనలు

- ఈ నెల 21న అర్ధరాత్రి భువనగిరి పట్టణంలోని టచ్ మొబైల్ షాపులో చోరీ జరిగింది. 30 లక్షల విలువైన సెల్‌ఫోన్, నగదు ఎత్తుకెళ్లారు.
- 19న భువనగిరి పట్టణంలోని లక్ష్మి జ్యువెల్లర్స్‌లో షట్టర్ విరగ్గొట్టి.. బంగారం, వెండిని దొంగిలించారు.
- 16న తెల్లవారుజామున యాదగిరిగుట్ట పట్టణంలో ఒకే రోజు ముగ్గురి ఇంట్లో చోరీ జరిగింది. 12 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.లక్ష వరకు నగదు అపహరించారు.
- 15న బీబీనగర్ మండలంలో ఇంటికి తాళం వేసి ఉన్న రెండు ఇండ్లలో దొంగతనానికి పాల్పడారు. ఈ ఘటనలో రూ.15వేల నగదు, 15తులాల బంగారం చోరీకి గురైంది.
- జూలై రెండో వారంలో భువనగిరి మండలంలోని ఏడుగురు రైతుల కరెంట్ బాక్స్‌లు దొంగతనం చేశారు.
- ఈ నెల 5న చౌటుప్పల్ మండలంలోని దేవులమ్మ నాగారంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి బంగారం, నగదు అపహరించారు.
- జూన్ 22న చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం పరిధిలో రాత్రి సమయంలో ఆగి ఉన్న కారులో నుంచి రూ.1.48లక్షల దారి దోపిడీ జరిగింది.
- మే చివరి వారంలో పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామ శివారులో తాళవేసిన ఇంట్లో చోరీ జరిగింది.

హామీలు అమలు చేయాలి

- వేతనం రూ.18 వేలకు పెంచాలి.. అన్ని బెనిఫిట్స్ కల్పించాలి
- కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తల ధర్నా

సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

రామగిరి/బొడ్రాయిబజార్, జూలై 22 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. నల్లగొండ, సూర్యాపేట కలెక్టరేట్ల ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, శ్రామిక మహిళా సమాఖ్య సూర్యాపేట జిల్లా కార్యదర్శి చెరుకు యాకలక్ష్మి మాట్లాడుతూ ఈ బడ్జెట్ సమావేశాల్లోనే పెరిగిన ధరలకు అనుగుణంగా ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలు అమలు చేయాలన్నారు. ఇన్యూరెన్స్ రూ. 50లక్షలు ఇవ్వాలని, 20 రోజులు క్యాజువల్ సెలవులు ఇవ్వాలని, 6నెలల వేతనంతో కూడిన మెడికల్ లీవ్స్, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. గత మూడు సంవత్సరాలుగా యూనిఫామ్ ఇవ్వడం లేదని, 20సంవత్సరాలుగా పని చేస్తున్న ఆశ వర్కర్లను పరీక్షల పేరుతో తొలగించాలని కేంద్రం కుట్రలు చేస్తున్నదని చెప్పారు. అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు అందజేశారు.

ఈ ధర్నాలో సీఐటీయూ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.మహేశ్వరి, టి.వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీమ్, నాయకులు దండెంపల్లి సత్తయ్య, రమావత్ కవిత, వసంత, పార్వతమ్మ, విమల, ఆశ వర్కర్లు కవి, హుస్సేన్, పద్మ, తులసి, రాధా, నాగమణి, సంధ్య, విజయ, లింగమ్మ, వాని, ముత్యాల రాణి, కనకమ్మ, వాణి, పద్మ, పద్మశ్రీ, రమణ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.